సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 2 । జూన్ । 2023



ఆశ్రమ' సీఆర్టీలకు తీపి కబురు
ఐటీడీఏ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏడాది కాలం పూర్తి వేతనం ఇవ్వాలని నిర్ణయించింది. 8లో▸



కానరాని 'పల్లెవెలుగు' 9లో▸
బోథ్ మండలంలోని అనేక గ్రామాలకు నేటికీ పల్లెవెలుగు బస్సులు రావడంలేదు. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రమాదకర రీతిలో ప్రయాణిస్తున్నారు.

గరిష్టం/కనిష్టం 42.0/29.0

వాతావరణం
ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

8నుంచి ఫిష్ ఫుడ్‌ఫెస్టివల్

కైలాస్‌నగర్: ఈ నెల 8నుంచి 10వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో ఫిష్ ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వై.సాంబశివరావు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కలెక్టరేట్ చౌక్‌లోగల రెవెన్యూ గార్డెన్స్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమంలో 10 స్టాళ్లను ఏర్పాటు చేసి వివిధ రకాల చేపలు, రొయ్యల వంటకాలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. వంటల అనుభవం కలిగిన వారు జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హాస్టళ్లలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి వసతి గృహంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లాలోని బీసీ వసతి గృహాల సంక్షేమాధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ కళాశాలలో బాలురు, బాలికల సీట్లు, ఇచ్చోడలోని వసతి గృహాల్లో ఖాళీలున్నాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు వెబ్‌సైట్ https:// bchostels. cgg. gov. in లో దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం విడ్డూరం'



ఇంటింటికీ కాంగ్రెస్‌లో నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సీఎం కేసీఆర్ ప్రకటించడం విడ్డూరంగా ఉందని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ పేర్కొన్నారు. ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. దళితబంధు మంజూరుకు దళితుల వద్ద 30 శాతం కమీషన్ తీసుకున్నారని, విద్యార్థులకు కేజీ టూ పీజీ ఉచిత విద్య అందించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన గిరిజనులు, మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్ల హామీ అమలు చేయనందుకు ఉత్సవాలు జరుపుకోవాలా? అంటూ మండిపడ్డారు. నాయకుడు చరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లీగ్ నిర్వహణ అభినందనీయం



క్రికెట్ ఆడి మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్: ఐపీఎల్ తరహాలో ఆదిలాబాద్ ప్రీమియర్ లీగ్‌ను నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పేర్కొన్నారు. ఈ నెల 1నుంచి 4వ తేదీ వరకు డైట్ మైదానంలో జేసీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లీగ్ మ్యాచ్‌లను గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఐపీఎల్ మ్యాచ్‌లకు ప్రస్తుతం మంచి క్రేజ్ ఉందని, దాన్ని తలపించేలా జేసీ అకాడమీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి టోర్నీలు క్రీడాకారులను ప్రోత్సహించేలా ఉపయోగపడుతాయని చెప్పారు. జిల్లా క్రీడాకారులు భవిష్యత్‌లో ఐపీఎల్ ఆడాలని ఆకాంక్షించారు. ఆదిలాబాద్ పట్టణంలోని క్రీడాకారులను ఒకే వేదికపై తీసుకువచ్చి ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నామని జేసీ అకాడమీ నిర్వాహకుడు జయేంద్ర పటాస్కర్ తెలిపారు. నాలుగు రోజులపాటు లీగ్ మ్యాచ్‌లు ఉంటాయని, నాలుగు జట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జేసీ అకాడమీ నిర్వాహకులు అయ్యూబ్, ఎజాజ్ తదితరులున్నారు.

ప్రగతి ప్రతిబింబించేలా..



జాతీయ పతాకావిష్కరణకు ముస్తాబైన కలెక్టరేట్‌లోని వేదిక

- నేటి నుంచి 'దశాబ్ది' ఉత్సవాలు
- ముస్తాబైన ఆఫీసులు, కూడళ్లు
- రైతు, చెరువుల పండుగకు ప్రత్యేకాధికారుల నియామకం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 2నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న వేడుకల్లో తొమ్మిదేళ్ల తెలంగాణ రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర అవతరణ శోభ ఉట్టిపడేలా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు, జిల్లా, డివిజన్ కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లన్నింటినీ రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. దీంతో ఉత్సవ శోభ కాంతులీనుతోంది. మండలాలు, గ్రామాల్లోనూ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగను విజయవంతం చేసేలా జిల్లాలోని చెరువు, రైతువేదికకు ఒకరు చొప్పున ప్రత్యేకాధికారులను నియమించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధిని చాటిచెప్పేలా నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయనున్నారు.

ప్రత్యేకాధికారుల నియామకం

జిల్లాలో జరిగే దశాబ్ది వేడుకల విజయవంతానికి నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలవారీగా ప్రత్యేకాధికారులను నియమించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ నేతృత్వంలో ఈ వేడుకలు జరగనున్నాయి. నియోజకవర్గ స్థాయిలో జరిగే వేడుకల పర్యవేక్షణ బాధ్యతలను ఆర్డీవోలకు అప్పగించారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి రాథోడ్ రమేశ్, బోథ్ నియోజకవర్గానికి కదం సురేశ్‌ను నియమించారు. రోజువారీగా నిర్వహించే కార్యక్రమాలకు ఆయా శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగను విజయవంతం చేసేలా ప్రతీ చెరువు, రైతువేదికకు ఒక అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. 240మంది తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈలు, డీఈలు, జిల్లా స్థాయి అధికారులను ఒక్కో చెరువుకు ఒక్కొక్కరి చొప్పున నియమించారు. 101 రైతు వేదికలకు 101 మంది చొప్పున ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు. రైతులు అధికసంఖ్యలో పాల్గొనేలా చూడడంతో పాటు ర్యాలీలు, సభ నిర్వహణ, అతిథులకు ఆహ్వాన బాధ్యతలు వీరే పర్యవేక్షించాల్సి ఉంటుంది. వ్యవసాయ రంగం, చెరువుల అభివృద్ధిని చాటి చెప్పేలా ఫ్లెక్సీలు, పోస్టర్లను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు.

నేటి నుంచి వేడుకలు షురూ..

జిల్లాలో శుక్రవారం నుంచి రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు పండుగలా ప్రారంభం కానున్నాయి. తొలిరోజు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకావిష్కరణతో వేడుకలు మొదలవుతాయి. ప్రభుత్వ విప్ గంప గోవర్దన్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం కలెక్టరేట్ ఆవరణలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే వేదికకు రంగులద్ది ముస్తాబు చేశారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించేందుకు వీలుగా ప్రత్యేక కార్పెట్లను పరిచారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం ముఖ్య అతిథి సందేశంతో పాటు కార్యక్రమానికి హాజరైన వారు కూర్చునేందుకు వీలుగా ప్రత్యేక షామియానాలు, కుర్చీలను సిద్ధం చేశారు. ముఖ్య అతిథులు నివాళులర్పించే ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్దనున్న తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని శుభ్రం చేశారు. విద్యుద్దీపాలు, పూలదండలతో అందంగా అలంకరించనున్నారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. రాత్రి వేళ విద్యుద్దీపాల వెలుగులతో ఈ కార్యాలయాలు అవతరణ శోభతో కాంతులీనుతున్నాయి.

పండుగలా వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

దశాబ్ది వేడుకలను పండుగలా నిర్వహించాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఈ శ్రీధర్ సూచించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల నిర్వహణపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా అధికారులు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. వేడుకల్లో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనేలా చూడాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని, అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేస్తామని చెప్పారు. అంతకుముందు జిల్లాకు చేరుకున్న ప్రత్యేక కార్యదర్శికి కలెక్టర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ఎన్.నటరాజ్, డీఎఫ్‌వో రాజశేఖర్, ట్రెయినీ సహాయ కలెక్టర్లు శ్రీజ, వికాస్ మహతో, ఏఎస్పీ శ్రీనివాస్‌రావ్, ఆర్డీవోలు రాథోడ్ రమేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

తేదీ	కార్యక్రమం
3.	రైతు దినోత్సవం
4.	సురక్ష దినోత్సవం
5.	విద్యుత్ విజయోత్సవం
6.	పారిశ్రామిక ప్రగతి ఉత్సవం
7.	సాగునీటి దినోత్సవం
8.	ఊరూరా చెరువుల పండగ
9.	సంక్షేమ సంబురాలు
10.	సుపరిపాలన దినోత్సవం
11.	సాహిత్య దినోత్సవం
12.	తెలంగాణ రన్
13.	మహిళా సంక్షేమ దినోత్సవం
14.	వైద్యారోగ్య దినోత్సవం
15.	పల్లె ప్రగతి దినోత్సవం
16.	పట్టణ ప్రగతి దినోత్సవం
17.	గిరిజనోత్సవం
18.	మంచినీళ్ల పండగ
19.	హరితోత్సవం
20.	విద్యా దినోత్సవం
21.	ఆధ్యాత్మిక దినోత్సవం
22.	అమరుల సంస్మరణం

ప్రగతిని చాటిచెప్పేలా ...

ఈ నెల 3నుంచి 21వ తేదీ వరకు వివిధ శాఖల ద్వారా సాధించిన ప్రగతిని చాటిచెప్పేలా అట్టహాసంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గడిచిన తొమ్మిదేళ్ల పాలనలో ఆయా రంగాల్లో జరిగిన అభివృద్ధిని తెలిపేలా పోస్టర్లు, ఫ్లెక్సీలను ప్రదర్శించనున్నారు. రైతులను పెద్ద ఎత్తున భాగస్వాములను చేసేలా రైతు దినోత్సవం, చెరువుల పండుగను నిర్వహించనున్నారు. విద్యుత్ రంగంలో సాధించిన సంస్కరణలతో పాటు సంక్షేమశాఖల ద్వారా లబ్ధిదారులకు అందిన ప్రయోజనాన్ని వివరించనున్నారు. ఆయా సంక్షేమ శాఖల ద్వారా రుణ సబ్సిడీలను అందించనున్నారు. కొంతమంది నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. హరితహారం ద్వారా సాధించిన పచ్చదనం ప్రాధాన్యతను చాటి చెప్పనున్నారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా సాధించిన ప్రగతితో పాటు క్రీడలకు ప్రభుత్వమిచ్చిన ప్రాధాన్యత, ప్రోత్సాహాన్ని చాటేలా 5వేల మంది క్రీడాకారులతో భారీ ర్యాలీ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

కలెక్టరేట్ ఆవరణలో చేపట్టిన దశాబ్ది వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో రమేశ్‌రాథోడ్, అర్బన్ మండల తహసీల్దార్ సతీశ్ తదితరులున్నారు.

'గిరి' విద్యార్థులకు అన్ని సౌకర్యాలు

- జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



అదనపు తరగతి గది నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల గిరిజన విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని భీంపూర్ గ్రామంలోగల ఆశ్రమ పాఠశాలలో రూ.50లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గది నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయలు కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని చెప్పారు. విద్యాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావాలన్నారు. పాఠశాలల ప్రారంభానికి ముందే ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఏఈ సునీల్‌రాథోడ్‌ను ఆదేశించారు. నిధుల కోసం ఐటీడీఏ పీవోకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేశ్, స్థానిక సర్పంచ్ రాథోడ్ విష్ణు, కాంట్రాక్టర్ జాదవ్ సంజీవ్, ఎంపీటీసీ జాదవ్ రేణుక దిలీప్, పీఏసీఎస్ డైరెక్టర్ కాంతారావు దుర్గే తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

'దశాబ్ది' ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలపై తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 11మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం భీంపూర్ గ్రామంలో ఇటీవల మరణించిన అటవీశాఖ రేంజ్ అధికారి జాదవ్ పాండునాయక్ పెద్దకర్మలో పాల్గొన్నారు. ఎంపీడీవో రమేశ్, తహసీల్దార్ ఆర్కా మోతీరాం, ఎంపీవో స్వప్నశీల, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్ తదితరులున్నారు.

మహాజన్ సంపర్క్ అభియాన్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 30వరకు మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తొమ్మిదేళ్లలో సమర్థవంతమైన పాలన అందించినట్లు చెప్పారు. మోదీ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో మహాజన్ సంపర్క్ అభియాన్ నిర్వహణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా పార్టీలోని ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరిస్తూ ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. ప్రతీ నాయకుడు, ఒక్కో కార్యకర్త 20 ఇళ్లు ఎంపిక చేసుకొని కేంద్రం పథకాల గురించి తెలియజేయాలని సూచించారు. నాయకులు ఆదినాథ్, జోగు రవి, దినేశ్ మటోలియా, మయూర్ చంద్ర, లోక ప్రవీణ్‌రెడ్డి, జ్యోతిరెడ్డి రఘుపతి, రాజేశ్ పాల్గొన్నారు.

'ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి'



మాట్లాడుతున్న బ్రహ్మశ్రీ పద్మతుకారాం స్వామి

నేరడిగొండ: ప్రతీఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని చిన్మయ మిషన్ గుంటూరు బ్రహ్మశ్రీ పద్మ తుకారాం స్వామి సూచించారు. మూడు రోజులుగా మండల కేంద్రంలోని సద్గురు శబరిమాతాజీ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉండడంతో పలు గ్రామాల నుంచి శబరిమాత భక్తులు, స్వాములు హాజరయ్యారు. వేదపండితుడు రాజు పంతులు వేదమంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో మూడురోజులుగా పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు స్వాములు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆలయాలు నిర్మించి భక్తి భావనను ప్రజలకు వివరించాలని సూచించారు. కాగా, మొదటిరోజు ఏలేటి మధుమిత, ఏలేటి సుధార్‌రెడ్డి, రెండోరోజు ఏలేటి అమూల్య అశ్విన్‌రెడ్డి, ముగింపురోజు నేరడిగొండ మండల కేంద్రంలోని రాజస్థాన్ హోటళ్ల యజమానులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలకు జెడ్పీటీసీ అనిల్‌జాదవ్, ఎంపీపీ రాథోడ్ సజన్, సర్పంచ్ పెంట వెంకటరమణ, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ తదితరులు హాజరై పూజ కార్యక్రమాలు చేపట్టారు. భూదాత సరసాని లక్ష్మి కుటుంబ సభ్యులు, విగ్రహ దాత స్థానిక సర్పంచ్ పెంట వెంకటరమణ కుటుంబ సభ్యులను స్వాములు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కాగా, పలువురు దాతలు ఆలయ అభివృద్ధికి భారీ ఎత్తున విరాళాలు అందజేశారు.

రూ.4,500 కోట్లతో అభివృద్ధి

- విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట
- ఖరీఫ్ నాటికి చనాకా–కొరట సాగునీరు
- టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు కృషి
- ప్రతీ గ్రామానికి తారురోడ్లు, తాగునీరు
- ఐటీ టవర్‌తో యువతకు ఉపాధి
- 'సాక్షి'తో ఎమ్మెల్యే జోగు రామన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్లలో రూ.4,500 కోట్లతో ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే జోగు రామన్న తెలిపారు. వచ్చే ఖరీఫ్ నాటికి చనాకా–కొరట బ్యారేజ్ ద్వారా సాగునీటిని అందిస్తామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో టెక్స్‌టైల్ పార్క్, ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు, పత్తి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే రామన్న 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు..

సాక్షి: తొమ్మిదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఏమిటి?

ఎమ్మెల్యే: రైతుబంధు ద్వారా 38,304 మంది రైతుల ఖాతాల్లో రూ.650 కోట్లు జమ చేశాం. రైతుబీమా ద్వారా 694 మంది రైతులకు రూ.5లక్షల చొప్పున రూ.34.70కోట్లు అందించాం. దళితబస్తీ ద్వారా 856 మందికి 2,214 ఎకరాలు పంపిణీ చేశాం. స్వయం ఉపాధి పథకాల కింద 1,788 మందికి రూ.36.18కోట్లు మంజూరు చేశాం. దళితబంధు కింద 100 మందికి రూ.10లక్షల చొప్పున అందించాం. 29,467 మందికి ప్రతీనెల వివిధ పింఛన్ల కింద రూ.6.24కోట్లు పంపిణీ చేస్తున్నాం. 12,098 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించాం.

సాక్షి: సీసీఐ పునఃప్రారంభానికి ఆందోళన చేసి వదిలేశారెందుకు?

ఎమ్మెల్యే: సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి బీజేపీ మినహా ఇతర పార్టీలు, సంఘాలతో కలిసి 70 రోజులపాటు ఆందోళన చేశాం. కేంద్రం స్పందించలేదు. దీనిపై గొంతెత్తని బీజేపీ నాయకులు ప్రైవేట్ ఫ్యాక్టరీ విషయంలో అత్యుత్సాహం ప్రదర్శించి ఆందోళనకు దిగడం సిగ్గుచేటు.

సాక్షి: నిరుద్యోగ యువతకు ఉపాధికల్పనకు ఎలాంటి చొరవ చూపుతున్నారు?

ఎమ్మెల్యే: ఇంజినీరింగ్ చదువుకున్న యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ఐటీ టవర్‌ను సాధించుకున్నాం. బట్టిసావర్గాం సమీపంలో సొంత భవన నిర్మాణానికి ఈనెలలోనే మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారు. దీని ద్వారా ఏడాదికి 800 మందికి ఉపాధి లభించనుంది.

సాక్షి: అభివృద్ధి లేదు.. అంతా ఆర్భాటమేనని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై ఎలా స్పందిస్తారు?

ఎమ్మెల్యే: 65 ఏళ్లలోలేని అభివృద్ధిని తొమ్మిదేళ్లలో చేసి చూపించాం. సాత్నాల ప్రాజెక్ట్ ద్వారా సాగునీరందించాం. చనాకా–కొరట బ్యారేజ్ నిర్మించాం. అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలిచాం.

సాక్షి: బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల ఎప్పుడు ప్రారంభిస్తారు?

ఎమ్మెల్యే: తరగతుల ప్రారంభానికి సంబంధిత యూనివర్సిటీ నుంచి అనుమతి లభించింది. ఈ విద్యాసంవత్సరం నుంచి తాత్కాలికంగా కృషి విజ్ఞాన కేంద్రంలో 60 సీట్లతో తరగతులు ప్రారంభమవుతాయి. కళాశాల కోసం 90 ఎకరాలు కేటాయించాం.

సాక్షి: ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఏం చేస్తున్నారు?

ఎమ్మెల్యే: ఆదిలాబాద్ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. కేఆర్‌కే కాలనీ మినహా ఎక్కడా సమస్యలు లేవు. కేఆర్‌కే కాలనీలో రోడ్లు, తాగునీటి కోసం టెండర్ ప్రక్రియ పూర్తయింది. పట్టణాభివృద్ధికి ఇటీవల రూ.325 కోట్లు మంజూరయ్యాయి. అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, తాగునీటి కోసం కృషి చేస్తాం.

సాక్షి: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తిస్థాయి సేవలెప్పుడు అందుతాయి?

ఎమ్మెల్యే: రిమ్స్ ఆస్పత్రికి ఇటీవల 40 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ప్రభుత్వం కేటాయించింది. పోస్టులు భర్తీ అయ్యాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిన పోస్టుల కేటాయింపు జరిగింది. త్వరలో వీటిని రద్దు చేసి రెగ్యులర్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

సాక్షి: గిరిజన యూనివర్సిటీ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎమ్మెల్యే: గిరిజన యూనివర్సిటీ కేంద్రం పరిధిలోని అంశం. గతంలో దీని కోసం పోరాటం చేశాం. మరోసారి సీఎం దృష్టికి తీసుకెళ్లి ప్రయత్నిస్తా.

సాక్షి: పురోగతిలో ఉన్న పనులేవి?

ఎమ్మెల్యే: ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు కొనసాగుతున్నాయి. బీసీ సంక్షేమ భవన్, జైనథ్‌లో మినీ స్టేడియం, ఆదిలాబాద్ పట్టణంలో ఆడిటోరియం, రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిలు, రోడ్లు, రూ.200 కోట్లకు సంబంధించి టెండర్ పనులు పూర్తయ్యాయి. ఎన్నికల నాటికి వీటన్నింటినీ పూర్తి చేస్తాం. మరో రూ.150 కోట్లు తీసుకొచ్చి మొత్తం రూ.5వేల కోట్ల నిధులతో పనులు పూర్తి చేస్తాం.

'ఎస్‌సీఆర్‌పీ'ని రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గణేశ్

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 6న నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ (ఎస్‌సీఆర్‌పీ) పరీక్షను వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐటీడీఏ సరస్వతి విశ్రాంతి భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎస్‌సీఆర్‌పీ పరీక్షలు నిర్వహించడం తగదని, వెంటనే పరీక్షను రద్దు చేసి ఎస్‌సీఆర్‌పీలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తుడుం దెబ్బ జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పరాణి, మావల మండలాధ్యక్షుడు ఆత్రం గణపతి తదితరులున్నారు.

ఎంపీ బ్రిజ్‌భూషణ్ దిష్టిబొమ్మ దహనం



నిరసన తెలుపుతున్న నాయకులు

ఎదులాపురం: ఆయా జాతీయ సంఘాల పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా గురువారం బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌సింగ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం జాతీయ కార్మిక, రైతు, ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడారు. రెజ్లర్లపై లైంగికదాడికి పాల్పడ్డ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను రెజ్లర్ల సంఘం అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని, వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌నారాయణ, వివిధ సంఘాల నాయకులు అగ్గిమల్ల స్వామి, జగన్‌సింగ్, చిల్కా దేవిదాస్, బండి దత్తాత్రి, పూసం సచిన్, మెస్రం భాస్కర్, ఎండీ ధర్మియా పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్నిప్రమాదంలో కారు దగ్ధం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన కారు

ఇచ్చోడ: మండలంలోని ఇస్లాంనగర్ వద్ద రహదారిపై నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారులో గురువారం మధ్యాహ్నం ఆకస్మాతుగా మంటలు చెలరేగాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు కారులోనుంచి దిగడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు 100కు తెలుపడంతో వారు అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత



పట్టుబడిన లారీలు

కడెం: మండలంలోని బెల్లాల్ సమీపంలోని గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక లారీలను గురువారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన లారీలకు రూ.20వేల జరిమానా విధించించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య హెచ్చరించారు.

పాక్షికంగా ఇల్లు దగ్ధం



ఇంటిని పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని రాంజీగోండ్ నగర్‌కు చెందిన సోయం మచెందర్ ఇల్లు ప్రమాదవశాత్తు పాక్షికంగా కాలిపోయింది. వంట చేస్తున్నప్పుడు సిలిండర్ లీక్ కావడంతో మంటలు చెలరేగాయి. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మంటలు ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ తిరుపతి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. సమయానికి మంటలు ఆర్పి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్న అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలియచేశారు. వంట చేసే సమయంలో గ్యాస్ సిలిండర్ విషయంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామస్తులు బయటికి వెళ్లే సమయంలో ఇంట్లో దీపాలు ఆర్పి బయటికి వెళ్లి తగు జాగ్రత్తలు తెలియచేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

నర్సాపూర్(జి): నర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన ఓ మైనర్ బాలికకు వరుసకు మేనబావతో వివాహం జరుపుతున్నారనే సమాచారం మేరకు ఐసీడీఎస్, ఐసీపీఎస్, రెవెన్యూ, పోలీసు అధికారులు అడ్డుకుని బాలిక తల్లిదండ్రులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహంతో కలిగే నష్టాలను వివరించారు. వివాహ వయస్సు వచ్చిన అనంతరం పెళ్లి చేయాలని, లేని పక్షంలో చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సుమతి, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, అంగన్‌వాడీ టీచర్ గంగామణి, పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి, ఏఎస్‌ఐ మాన్‌సింగ్, ఆర్‌ఐ వేణుగోపాల్, న్యాయవాది నరేందర్ పాల్గొన్నారు.

బైక్ పైనుంచి పడి ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద: బైక్‌పై నుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం నిర్మల్ రూరల్ మండలంలోని చిట్యాల్ గ్రామానికి చెందిన పోగులు దత్తాద్రి మండలంలోని కనకాపూర్ గ్రామానికి పని నిమిత్తం వెళ్లాడు. రాత్రి తిరుగు ప్రయాణంలో కనకాపూర్ జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి పడిపోయాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మహిళలకు గాయాలు....

మండల కేంద్రానికి చెందిన సుంకరి చిన్నమ్మ (55) గురువారం చేనుకు వెళ్లింది. సాయంత్రం తిరుగు ప్రయాణంలో ఇంటికి తన కుటుంబ సభ్యులతో కలిసి బైక్‌పై వస్తుండగా బైక్‌పై నుంచి కింద పడింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

‘ఆశ్రమ’ సీఆర్టీలకు తీపి కబురు

- 12నెలల వేతనానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో 1,126 మందికి ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న సీఆర్టీలు

ఉమ్మడి జిల్లా సీఆర్టీల వివరాలు..

జిల్లా	సీఆర్టీల సంఖ్య
నిర్మల్	143
ఆదిలాబాద్	450
మంచిర్యాల	103
కుమురంభీం	430



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఐటీడీఏ, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లకు (సీఆర్‌టీ) రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇప్పటికే ఇతర శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాల పెంపు వంటి ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకున్న ప్రభుత్వం, ఆశ్రమ పాఠశాలల సీఆర్‌టీలకు కూడా ఏడాది కాలంపాటు పూర్తి వేతనం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 1126 మందికి ప్రయోజనం కలుగనుంది.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్‌టీ) పని చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచారు. సీఆర్‌టీల వేతనం కూడా పెంచి నెలకు ఎస్జీటీలకు రూ.21,255, స్కూల్ అసిస్టెంట్లకు రూ.28,977 అందజేస్తున్నారు. ఒక విద్యా సంవత్సరంలో ఏప్రిల్‌లోని చివరి పనిదినం వరకు అనగా పదిన్నర నెలలు మాత్రమే వీరికి వేతనం అందించే వారు. వేసవి సెలవుల్లో వేతనం ఇచ్చేవారు కాదు. వేసవి సెలవుల్లో కూడా తమకు వేతనం అందజేయాలని సీఆర్‌టీలు గత కొన్నేళ్ల నుంచి ప్రభుత్వానికి విన్నవిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో వీరి విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం 12 నెలల వేతనం అందజేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం 2022–23 విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

జిల్లాలో 160మంది సీఆర్‌టీలకు ప్రయోజనం..

నిర్మల్ జిల్లాలో గిరిజన సంక్షేమశాఖ పరిధిలో 17ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్ టీచర్లతో పాటు 143 మంది సీఆర్‌టీలు పని చేస్తున్నారు. వీరిలో 60మంది ఎస్జీటీలు, 83మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గత విద్యా సంవత్సరం (2022–23) నుంచి వీరందరికీ 12 నెలల వేతనం అందనుంది. ప్రభుత్వ నిర్ణయంపై సీఆర్‌టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాము ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నామని, రెగ్యులరైజ్ చేయాలని సీఆర్‌టీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



సీఆర్‌టీలకు పదిన్నర నెలల వేతనం కాకుండా ఏడాది కాలానికి పూర్తి వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశాం. మా విజ్ఞప్తులకు సానుకూలంగా ప్రభుత్వం స్పందించి సముచిత నిర్ణయం తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. సీఆర్‌టీలు గత 20ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాం. మా ఉద్యోగాలనూ రెగ్యులరైజ్ చేస్తే సీఎం కేసీఆర్‌కు, ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– మునినాయక్, జిల్లా ఆశ్రమ పాఠశాలల, సీఆర్టీల సంఘం అధ్యక్షుడు, నిర్మల్

12 నెలల వేతనం హర్షణీయం..



రెండు దశాబ్దాలుగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు. అప్పట్లో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ పేరుతో విధుల్లో చేరిన వీరంతా 20ఏళ్లుగా బోధన చేస్తున్నారు. రాష్ట్రం వచ్చిన తరువాత ఎన్నోసార్లు పలు పద్ధతుల్లో ప్రభుత్వానికి విన్నవించుకుంటూ వస్తున్నాం. 12నెలల వేతనాలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయం.

– తోట నరేంద్రబాబు, పీఆర్టీయూ అధ్యక్షుడు, నిర్మల్

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రభుత్వం

- కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు
- ఉమ్మడి జిల్లా సమస్యలపై సీఎం స్పందించాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

ఖానాపూర్: సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో గురువారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కులను సైతం కేసీఆర్ ప్రభుత్వం కాలరాస్తు, ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తుందన్నారు. ఖానాపూర్ మండలంలో నిర్మించే సదర్‌మాట్ బ్యారేజిని నిర్మల్‌కు తరలించడంతో పాటు ప్రత్యేక కాలువ ఏర్పాటు చేయకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని వివరించారు. వేలాదికోట్లతో తెచ్చిన మిషన్ భగీరథ కమీషన్ భగీరథగా మారిందని ఎద్దేవా చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కనీసం తాగునీరు అందక గిరిజనులు, పేదల గొంతు తడుపుకునేందుకు నానా ఇక్కట్లు పడుతున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా ప్రజల ఇక్కట్లపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ‘‘నీటిగోసపై కాంగ్రెస్ పోరు’’ పేరుతో ఆందోళనలు చేపడుతామన్నారు. రైతులకు రుణమాఫి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలం అయ్యారన్నారు. కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శాంతియుతంగా నిరసనలు కూడా తెలుపకుండా పోలీసులు 30 ఆక్ట్ పేరుతో అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేశ్, నాయకులు తోట సత్యం, ముషీర్, మల్లేశ్, సత్తన్న, తదితరులున్నారు.

పదేండ్ల పోస్టర్ ఆవిష్కరించిన కేటీఆర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

ఇచ్చోడ: పదేండ్ల వైభవ పోస్టర్‌ను మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ముఖరా(కె) సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌లు గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్లో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ పల్లెప్రగతి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో గ్రామాలు జీవం పోసుకున్నాయని తెలిపారు. పదేండ్ల కాలంలో ముఖరా కె గ్రామం అన్నీ రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా ఎన్నో అవార్డులు ముఖరా కె పంచాయతీ దక్కించుకున్నాదని తెలిపారు. గ్రామల్లో పల్లెప్రగతి ఫలాలు ప్రజలకు చేరుతున్నాయని అందుకు ముఖరా(కె) నే ఉదాహరణగా చెప్పుకోవచ్చని తెలిపారు.

ధూపదీప నైవేద్యానికి నిధుల పెంపు

- రూ.10వేలు పెంచుతూ కేసీఆర్ నిర్ణయం
- జిల్లాలో 103 ఆలయాలు కొత్తగా స్కీంలోకి..
- అర్చకుల్లో హర్షాతిరేకాలు

జిల్లాలోని వివరాలు..

ధూపదీప నైవేద్యం అమలవుతున్న ఆలయాల సంఖ్య:	148
మొదటి విడత దరఖాస్తు చేసుకున్న వారు:	59
రెండవ విడత దరఖాస్తు చేసుకున్న వారు:	159
మూడో విడత దరఖాస్తు చేసుకున్న వారు:	103



నిర్మల్‌చైన్‌గేట్: ఆదాయం తక్కువగా ఉన్న ఆలయాల నిర్వహణకు ధూపదీప నైవేద్యం పథకం కింద ఇస్తున్న వేతనం, పడితరం ఖర్చులకు రూ.10 వేలు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ బుధవారం ప్రకటించగా.. జిల్లాలోని 148 ఆలయాలకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటివరకు జిల్లాలో 148 ఆలయాలకు అర్చకుడి వేతనం రూ.4వేలు, ఇతర ఖర్చులకు రూ.2వేలు మొత్తం రూ.6వేల చొప్పున ఆలయ ఖాతాల్లో జమయ్యేవి. అయితే ఈ మొత్తాన్ని రూ.10వేలకు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు.

కొత్తగా 103 ఆలయాలు..

ధూపదీప నైవేద్యం కింద మొదటి విడతగా జిల్లాలో 59 ఆలయాలు రెండో విడతలో 159 ఆలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో నుంచి అనర్హులను తొలగించి రాష్ట్ర ప్రభుత్వం 162 మందిని గుర్తించింది. అనివార్య కారణాలతో 14మంది తమ విధులను హాజరు కావడం లేదు. దీంతో జిల్లాలో 148 ఆలయాల్లో ధూపదీప నైవేద్య పథకం అమల్లో ఉంది. మూడో విడతలో భాగంగా జిల్లాలో 103మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. వీటికి కూడా పథకం వర్తిస్తే జిల్లాలో ఆలయాల సంఖ్య 253కు పెరగనుందని జిల్లా దేవాదాయ శాఖ అధికారి రవికిషన్ తెలిపారు.

2007లో ప్రారంభం...

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదాయం తక్కువగా ఉన్న ఆలయాలు శిథిలావస్థకు చేరగా 2007లో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ఆలయాలపై దృష్టి సారించారు. ఆలయాలు మూతబడవద్దనే ఉద్దేశంతో అర్చకుల వేతనం రూ.2వేలు, ఇతర ఖర్చులు రూ.500 కలిపి రూ.2500 ఆలయ ఖాతాల్లో జమయ్యేలా చూశారు. 2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఈ మొత్తాన్ని రూ.6వేలకు పెంచారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో రూ.6వేలు సరిపోవడం లేదంటూ అర్చకులు కొంత కాలంగా ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు వారి వేతనాన్ని రూ.10 వేలకు పెంచడంతో వారిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇక వేద పండితులు, శాస్త్ర పండితులకు చెల్లించే గౌరవ వేతనాన్ని కూడా రూ.2500 నుంచి రూ.5,000కు పెంచారని, ఈ భృతి పొందే వయసును 75ఏళ్ల నుంచి 65 ఏళ్లకు తగ్గించారు.

వేతన పెంపు సంతోషదాయకం

దూప దీప నైవేద్యం కింద తెలంగాణ సర్కార్ పదివేల రూపాయలు ఇవ్వడం సంతోషదాయకం. గతంలో 6000 వచ్చే జీతం రూ.10వేలుగా మార్చడం ఎంతో సంతోషం. అదేవిధంగా దూప దీప నైవేద్యం కింద పురాతన దేవాలయాలలో పనిచేసే అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించి బ్రహ్మణులు ఆదుకోవాలి. కేసీఆర్ దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– సిరిగే రమేష్ శర్మ, ధూప దీప నైవేద్య రాష్ట్ర కార్యదర్శి

‘కవ్వాల్’లో అడవికుక్కల బెడద

- అభయారణ్యంలో పెరిగిన కుక్కల సంఖ్య
- పులినైనా ఎదిరించే సత్తా
- భయంతో అడవిలో కాలుపెట్టేందుకు బెబ్బులి వెనుకడుగు



అడవి కుక్కలు

జన్నారం(ఖానాపూర్): అడవి కుక్కలకు పులులు కూడా భయపడుతాయి. వన్యప్రాణులను హడలెత్తించే బెబ్బులి కూడా అడవికుక్కలను చూసి వెనుదిరుగుతుంది. పులి వేటాడిన జంతువును అడవికుక్కలు లాక్కుపోతాయి. పులికి ఎదురు తిరిగే అడవి కుక్కల సంఖ్య పెరుగుతుండడంతో కవ్వాల్ అభయారణ్యంలో కాలుపెట్టడానికి పులి వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. వన్యప్రాణులను భయపెట్టే బెబ్బులి అడవి కుక్కలను చూసి భయపడుతుందా? అంటే అటవీశాఖ అధికారులు నిజమే అంటున్నారు. కొన్నిరోజులు రాకపోకలు కొనసాగించిన పులి ఏడాది కాలంగా కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో అడుగు పెట్టడం లేదు.

పులులకు అనువైన ప్రాంతం..

దట్టమైన అటవీ ప్రాంతం.. రకరకాల వన్యప్రాణులు.. పులి ఉండేందుకు అనువైన ఆవాసాలు.. జలపాతాలు.. కలబోసిన కవ్వాల్ అడవులు. ఈ అడవులు పులులకు అనువుగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం 2012 ఏప్రిల్ మాసంలో కవ్వాల్ అభయారణ్యాన్ని టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేసింది. టైగర్‌జోన్ అడవులను 892.23 స్క్వేర్ కిలోమీటర్ల కోర్ ఏరియా, 123.12 స్క్వేర్ కిలోమీటర్ల బఫర్ ఏరియాగా గుర్తించారు. కవ్వాల్ టైగర్‌జోన్‌కు సమీపంలో మహారాష్ట్రలోని తాడోబా, తిప్పేశ్వర్, టైగర్ రిజర్వ్, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్‌జోన్ ఉంటాయి. ఆయా టైగర్‌జోన్లలో పులుల సంఖ్య ఎక్కువ కావడంతో కవ్వాల్ టైగర్ జోన్‌లోకి ప్రవేశించే అవకాశాలున్నాయి. పులులకు అనువైన ప్రాంతంగా, ఇక్కడ పదికి పైగా పులులకు సరిపడా వన్యప్రాణులు, ఆవాసాలు ఉన్నందువల్ల ఇక్కడికి పులులు వస్తాయని అధికారులు అంచనా వేశారు.

టైగర్‌జోన్‌లో 240 వరకు అడవికుక్కలు

పులికి ఎదురు తిరిగే అడవి కుక్కలు అడవిలో ఎక్కువగా ఉండడం కూడా పులి రాకపోవడానికి ఒక కారణమని చెప్పవచ్చు. కవ్వాల్ టైగర్ జోన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డుల ప్రకారం సుమారుగా 240 వరకు అడవి కుక్కలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో సుమారుగా 120 వరకు అడవి కుక్కలున్నట్లు తెలుస్తోంది. 10 నుంచి 12 వరకు గ్రూపుగా ఉంటూ దాడికి దిగుతాయని, ఇలాంటి గ్రూపులు జన్నారం డివిజన్‌లో 10 వరకు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పులి ఇక్కడ ఉండక పోవడానికి అడవి కుక్కల బెడద కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చంటున్నారు.

ఎదురు తిరిగే సత్తా

వన్యమృగాల్లో ఒకటైన అడవి కుక్కలకు ఏ జంతువుపైన అయినా ఎదురు తిరిగే సత్తా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. జింకలు, నీలుగాయి, సాంబర్లు, చిరుత, పులి, ఎలుగుబంటి వంటి వన్యమృగాలపై కూడా అడవికుక్కలు గుంపులుగా దాడికి పాల్పడుతాయి. అందుకే అడవి కుక్కల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట పులులు, చిరుతలు ఉండవని అధికారులు చెబుతున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో దట్టమైన అడవులు, లోయలు ఎన్నో ఉన్నాయి. వీటిలోనే చిరుతలు, పులులు ఆవాసం ఏర్పాటు చేసుకుంటాయి. అయితే ఆయా ప్రాంతాల్లో కూడా కుక్కలు తిరుగుతూ పులులు వేటాడిన మాంసాన్ని లాక్కునివెళ్లి తింటాయి. అడవి కుక్కల సంఖ్య మరింత పెరిగితే వన్యప్రాణులకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది.

సంఖ్య పెరిగింది



కవ్వాల్ టైగర్‌జోన్‌లో జన్నారం డివిజన్ 12 శాతం మాత్రమే ఉంది. ఇక్కడ పులికి అనువైన ప్రదేశాలున్నాయి. జన్నారం అటవీ డివిజన్‌లో ఇటీవల అడవి కుక్కల సంఖ్య పెరిగింది. పులి రాకపోవడానికి అవి కూడా ఒక కారణం కావచ్చు. గతంతో పోలిస్తే డివిజన్‌లో అడవి కుక్కల సంఖ్య రెండురెట్లు పెరిగినట్లు తెలుస్తోంది.

– సిరిపురం మాధవరావు, ఫారెస్ట్ డివిజనల్ అధికారి

పాక్‌పట్లలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ఏర్పాటు

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



భీమన్న ఆలయం ప్రారంభిస్తున్న మంత్రి

నర్సాపూర్(జి): రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలని.. త్వరలో మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించిన భీమన్న ఆలయం, రూ.4 లక్షలతో నిర్మించిన నాయక్‌పోడ్ సంఘ భవనాలను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మంత్రి మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఈనెల రెండో తేదీ నుంచి 22వ తేదీ వరకు దశాబ్ధి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. సీసీ రోడ్ల పనుల బిల్లులను ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఖాతాలో జమ చేసినట్లు పేర్కొన్నారు. రాంపూర్ పంచాయతీతోపాటు దాని అనుబంధ గ్రామాలైన దర్యాపూర్, నసీరాబాద్‌లో రూ.కోటి రూపాయలతో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామన్నారు. గ్రామానికే చెందిన మైనార్టీ సోదరులు మజీద్‌కు ప్రహరీ, సీసీ రోడ్డుకు నిధులు కేటాయించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవింద్‌రెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య, నర్సాపూర్(జి) సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు సుభాశ్‌రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, బన్సపల్లి పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, కొండ్ర రమేశ్, గోపిడి గంగారెడ్డి, నడిపొల్ల రవి, అధికారులు పీఆర్ డీఈ తుకారాం, ఏఈ సూర్య తేజాగౌడ్, ఎంపీడీఓ అల్లాడి వనజ, ఇన్‌చార్జి తహసీల్దార్ సుమతి, ఆర్‌ఐ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి నవనీత్‌కుమార్ పాల్గొన్నారు.

20 లీటర్ల ‘మహా’ మద్యం పట్టివేత

భైంసాటౌన్: మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నజీర్ హుస్సేన్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి ముధోల్–ఎల్వత్ మార్గంలో తనిఖీ చేపట్టగా ఓ వ్యక్తి వద్ద నుంచి 20 లీటర్ల మహారాష్ట్ర మద్యం సీసాలు లభించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్సై రమేశ్‌గౌడ్, కానిస్టేబుళ్లు శైలేశ్, సంతోష్, తదితరులున్నారు.

మొసళ్ల కోసం రెస్క్యూ ఆపరేషన్



మల్లాపూర్ చెరువులో పెట్టిన బోను

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ చెరువులోని మొసళ్లను పట్టుకోవడం కోసం అటవీశాఖ అధికారులు రెస్క్యూ ఆపరేషన్ మొదలుపెట్టారు. కొద్ది రోజుల కిందట చెరువులో రెండు మొసళ్లను గుర్తించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. చెరువులో నీళ్లు ఎక్కువ ఉండడంతో వాటిని పట్టడం కష్టమని తెలుపడంతో చెరువులోని నీటిని కిందకు వదిలారు. దీంతో గురువారం అటవీశాఖ డిప్యూటీ ఎఫ్ఆర్వో నజీర్‌ఖాన్ ఆధ్వర్యంలో చెరువులో రెస్క్యూ ఆపరేషన్ మొదలుపెట్టారు. బోనులు తెచ్చి చెరువులో ఉంచారు. అందులో చేపలు, చికెన్ ఉంచామని, వాటిని తినడానికి వచ్చి అందులో చిక్కుకునే అవకాశం ఉంటుందని అటవీశాఖ అధికారులు నజీర్‌ఖాన్ తెలిపారు. ఇందులో సర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ కేశం శ్రీనివాస్, ఎఫ్‌బీవో సుమన్ ఉన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2008-09 బ్యాచ్ విద్యార్థులు గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వానల్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొట్టమొదటి బ్యాచ్ విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులను కలిసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. 15ఏళ్లకు కలుసుకున్నవారంతా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరు పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు చదువులునేర్పిన ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాజారెడ్డి, నవీన్‌కృష్ణ, వెంకట్‌రావు, వరప్రసాద్, వెంకటరమణ, సుభాష్, నాగభూషన్ ఉన్నారు.